క్లుప్తంగా

నేడు అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతురావు తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా ధూపదీప నైవేద్యం సమర్పిస్తామన్నారు. అనంతరం 11 గంటలకు స్వామికి సుదర్శనహోమం , సాయంత్రం ప్రాకారోత్సవం జరుగుతుందని వివరించారు. పౌర్ణమి వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఉచిత ప్రసాదాలు అందజేస్తామన్నారు. క్షేత్రంలో భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు దాణా పంపిణీ చేస్తాం

గుడిపాల: పాడి రైతులందరికీ పశువుల దాణాను పంపిణీ చేయనున్నట్లు పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ అన్నారు. వారు మంగళవారం మాట్లాడుతూ ప్రస్తుతం ఒక్కో రైతుకు ఒకటి లేక రెండు బ్యాగులను 50శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు తెలియజేశారు. మండలంలో 17 సచివాలయాలకు గాను ఒక్కో సచివాలయానికి మూడు టన్నుల చొప్పున 51 టన్నులు సరఫరా చేయనున్నట్లు వివరించారు. అయితే పాడి రైతులు ఈ దాణాకు అవసరమైన మొత్తాన్ని వెటర్నరీ అసిస్టెంట్ల వద్ద ఇవ్వాలని వారు తెలియజేశారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించండి

ఐరాల: మండలంలోని రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షురాలు ఎల్. మాధవీలత ఎమ్మెల్యే మురళీమోహన్‌కు వినతి పత్రం అందజేశారు. చిత్తూరులో ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆయన్ను కలసి మండలంలో రేషన్ షాపుల్లో బియ్యం కొరత ఉందని వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి డీలర్లకు న్యాయం చేయాలని కోరారు.

గర్భిణులకు సుఖప్రసవం చేస్తాం


గర్భిణులతో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖప్రసవం చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలోనే గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక చొరవ తీసుకొని చికిత్స చేయనున్నట్లు చెప్పారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి విపులంగా వివరించారు. అన్ని పరీక్షలను నిర్వహించి పీహెచ్‌సీల్లోనే సుఖప్రసవం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కిశోరి వికాసం.. బాలికల భవితకు పునాది


కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుడిపాల: కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌తో యాద్రాక్షి, చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ అధికారి ఉమా అన్నారు. కిల్లారిపల్లె, వసంతాపురం అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కిశోరి బాలికలు సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, గౌరి, నిర్మల, ఇందిర పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లెలో మంగళవారం గంగజాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు అమ్మవారికి అంబలి సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నడివీధిలో ప్రతిష్ఠించిన గంగమ్మను దర్శించుకుని మంగళ హారతితో పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టి మహిళలు ఊరేగింపుగా వెళ్లారు.

త్వరలో స్లో మోటార్ సైకిల్ రైడింగ్ పోటీలు

చిత్తూరు అర్బన్: త్వరలో స్లో మోటార్‌సైకిల్ రైడింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు తెలిపారు. ఈ పోటీలకు 18 ఏళ్లు పూర్తయిన వారు ఇందుకు అర్హులన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా ఉండాలని చెప్పారు. పెండింగ్ చలానా ఉండకూడదన్నారు. పోటీలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ఉంటాయన్నారు. ఈ పోటీ వివరాలను త్వరలో వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు.


టీడీపీ నేతలు తవణంపల్లె మండలం తెల్లగుండ్ల పల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణమూర్తి యాదవ్ ఇంటిపై దాడి చేసి కూల్చివేసిన ప్రహరీగోడ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పూతలపట్టు నియోజకవర్గంలో అరాచక పాలన సాగుతోంది. ఈ ఏడాదిలో ఒక్క పథకమూ అమలు చేయలేదు. ఇసుమంతైనా అభివృద్ధి కానరాలేదు. కానీ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు విచ్చలవిడిగా కొనసాగాయి. గ్రామాలకు అందుబాటులో ఉండే సచివాలయాలను, శిలాఫలకాలను, మహానేత వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేశారు.

– సాక్షి టాస్క్‌ఫోర్స్


తుంబకుప్పంలో టీడీపీ నేతలు దాడి చేసి గాయపర్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రతాప్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ఏడాదంతా అరాచకం.. విధ్వంసం

08-11-2024

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్ రెడ్డిని పరామర్శిస్తున్న విజయానందరెడ్డి



పూతలపట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డిపై కూటమి పార్టీల నాయకులు దాడి చేశారు. పూతలపట్టులో శ్రీకాంత్‌రెడ్డి ఇంట్లో అతని భార్య, పిల్లలు ఉన్నారనే విషయం తెలుసుకున్న అధికార పార్టీ నేతలు అర్ధరాత్రి ఇంటిపై దాడి చేశారు. ఇంటి గేటులోపలకు చొరవడి లైట్లను పగులగొట్టారు. చుట్టు పక్కల వాళ్లు చూసి స్థానికులు కేకలు వేయడంతో పారిపోయారు. దాని తరువాత పూతలపట్టు వెళ్లడానికి శ్రీకాంత్ చిత్తూరు మీదుగా బయలుదేరారు. అప్పటికే ఇతడిని వెంబడించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కట్టమంచి వద్ద కారు దిగుతుండగా.. ముందస్తు ప్రణాళిక ప్రకారం తెచ్చుకున్న బీరుబాటిళ్లు, బండరాళ్లతో శ్రీకాంత్‌రెడ్డిపై దాడిచేసి, మట్టుబెట్టాలని ప్రయత్నించారు. నడిరోడ్డుపై అరగంటకు పైగా ఈ దాడి జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదు. అడ్డొచ్చిన కారు డ్రైవర్ సురేష్‌ను, పార్టీ కార్యకర్త కిరణ్‌కుమార్‌పై సైతం దాడి చేశారు. శ్రీకాంత్‌రెడ్డి కారును పూర్తిగా ధ్వంసం చేశారు.



26-06-2024



యాదమరి మండలం దాసరావల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లారు. అక్కడి నుంచి ఇంటికి బయల్దేరుతుండగా, ఎంపీడీఓ కార్యాలయం గేటు ఎదుట అదే గ్రామానికి చెందిన ఐదుగురు టీడీపీ నాయకులు కారులో నుంచి దిగి ఆయుధాలతో దాడి చేశారు. ఆయన తలకు తీవ్రగాయమైంది.

14-05-2025



గాయపడ్డ సిద్ధిక్, జాకీర్‌బాయ్


గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునీర్‌బాయ్


గాయపడిన కార్యకర్త

యాదమరి మండలం 14 కండ్రిగ ముస్లింవాడలో నెల క్రితం వైఎస్సార్‌సీపీ కార్యకర్త సిద్దిక్ ఇంటిపై టీడీపీ నాయకులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఇంట్లో ఉన్న మున్నీర్, జాకీర్ బాయ్‌ను చితకబాదాలు. ఇదే గ్రామంలో 11 నెలల ముందు కూడా వైఎస్సార్‌సీపీ నేత, స్థానిక సర్పంచ్ కబీర్ ఇంటిపై కూటమి నాయకులు దాడులకు తెగబడ్డారు. ఇంటి కిటికీలకు ఉన్న అద్దాలను, ఇంట్లోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అడ్డొచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను చితకబాదారు.

04-06-2024


టీడీపీ నేతల దాడిలో గాయపడ్డ అరుణ్‌కుమార్

బంగారుపాళ్యం మండలం మొగిలివారి పల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేశారు. అరుణ్‌కుమార్, రాజు, హరీష్‌తోపాటు పలువురుని తీవ్రంగా గాయపరిచారు. తగ్గువారిపల్లెలో గ్రామ సచివాలయం శిలాఫలకం బోర్డులను ధ్వంసం చేశారు. తుంబకుప్పంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ప్రతాప్, అతని భార్య శాంతిని టీడీపీ నేతలు తీవ్రంగా గాయపరిచారు.


తగ్గువారిపల్లె సచివాలయ శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న టీడీపీ శ్రేణులు


యాదమరి మండలం 14 కండ్రిగ ముస్లింవాడలో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ సర్పంచ్ కబీర్ ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేసిన కిటికీ అద్దాలు

31-01-2025

ఐరాల మండలం ఎగువ కామినాయన పల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత సుధాకర్ నాయుడికి చెందిన భూమిని స్థానిక టీడీపీ నేతలు కబ్జా చేసి ఫెన్సింగ్ వేశారు. బంగారుపాళెం మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు పదిమందిని రౌడీలను తీసుకొచ్చి సుధాకర్ నాయుడి భూమిలో ఫెన్సింగ్ వేశారు.



ఐరాల మండలం వడ్రంపల్లి వైఎస్సార్‌సీపీ బీసీ కార్యకర్త రామచంద్రకు చెందిన పశువుల షెడ్డును స్థానిక టీడీపీ నేతలు వీఆర్‌ఓ గోవిందప్ప, పోలీసుల సమక్షంలో జేసీబీ సహాయంతో రేకుల షెడ్డు కూల్చివేశారు.

20-05-2025



14-05-2025

గత నెల ఐరాల పీహెచ్‌సీలో కాంట్రాక్టు నర్సుగా విధులు నిర్వహిస్తున్న శకుంతలపై మద్యం మత్తులో ఐలవారిపల్లెకు చెందిన జనసేన కార్యకర్త నవీన్, అతని స్నేహితుడు, ఓ మహిళ కలసి దాడి చేసి గాయపరిచారు. అడ్డొచ్చిన నర్సు భర్త కిరణ్ పై దాడి చేశారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సు

పీఎం సూర్యఘర్‌పై అవగాహన సదస్సులు

- రాయితీతో సోలార్ రూఫ్‌టాప్ విద్యుత్
- క్షేత్రస్థాయిలో సోలార్‌మేళా
- కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విరివిగా పీఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ యోజన పథకంలో రాయితీతో సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవచ్చన్నారు. సోలార్ మేళా పేరుతో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచడానికి సోలార్ రూఫ్ టాఫ్ ఉత్పత్తి చేసే విద్యుత్‌తో ఇంటి అవసరాలను తీర్చుకోవడంతో పాటు మిగులు విద్యుత్‌ను తిరిగి గ్రిడ్ కు అమ్ముకోవచ్చన్నారు. ఈ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు మొదట మొత్తం నగదును చెల్లించి ఆ తర్వాత ప్రభుత్వ రాయితీ పొందవచ్చని వెల్లడించారు. ఈ పథకం అమలుకు ట్రాన్స్‌కో, నెడ్‌క్యాప్, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ విద్యాధరి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్, నెడ్ క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ రయాజ్, జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు, డీపీఓ సుధాకర్ రావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

రక్త పరీక్షలతో వ్యాధి నిర్ధారణ


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ


సరకల్లులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: రక్తపరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చని స్థానిక వైద్యాధికారి కేశవనారాయణ తెలిపారు. మండలంలోని మైనగుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. రక్త పరీక్షలు చేయించుకొన్న తర్వాత ఏ వ్యాధికి వైద్యం చేయాలని స్పష్టంగా తెలుస్తోందన్నారు. బీపీ, సుగర్ పరీక్షలను సకాలంలో చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెహెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మండలంలోని సరకల్లులో డాక్టర్ మోహన్‌వేలు 53 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులకు, చిన్నారులకు పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

తవ్వేశారు.. పూడ్చేది మరిచారు

కార్వేటినగరం: అసలే కార్వేటినగరంలో ట్రాఫిక్‌తో ఇబ్బందులు తప్పడం లేదు. ఇరుకైన రోడ్లు, రోడ్డుపైనే ఆటోలు, వాహనాలు, ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో జనం అవస్థలు పడుతున్నారు. ఇంత రద్దీగా ఉండే మండపం వీధిలో 10 రోజుల క్రితం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట మరమ్మతుల కోసం హడావిడిగా పెద్ద గొయ్యిను తవ్వారు. ఏమైందో కానీ గొయ్యిని పూడ్చడం మరిచి పోవడంతో ట్రాఫిక్ అంతరాయం మరింత జఠిలంగా మారింది. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే చాలు ఒక్క ద్విచక్ర వాహనం కూడా కదల్లేని పరిస్థితి నెలకొంది. దీంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదుపు తప్పి గోతిలో పడితే ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోననే భయం స్థానికులను పట్టి పీడిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి తీసిన గోతిని పూడ్చి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మండపం వీధిలో తవ్వి, వదిలేసిన గొయ్యి

ఏపీపీజీసెట్‌కు 85శాతం హాజరు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రెండు సెంటర్లలో జరిగిన ఏపీపీజీసెట్–2025 పరీక్షలకు 85శాతం హాజరైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, వేము కళాశాల పరిధిలో కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎకనామిక్స్, లైఫ్ సైన్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ పీజీ కోర్సులకు ప్రవేశ పరీక్షలు జరిగాయని తెలిపారు.

ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు

చిత్తూరు కార్పొరేషన్: ఏరువాక పౌర్ణమి సందర్భంగా అన్నదాతలకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈ పవిత్రమైన రోజు, తొలకరి జల్లులతో పుడమి తల్లి పులకించే వేళ, రైతన్నలు తమ వ్యవసాయ పనులను ప్రారంభించే శుభ తరుణమన్నారు. ఏరువాక పౌర్ణమి, వ్యవసాయదారుల జీవితంలో ఆనందాన్ని, సిరిసంపదలను నింపాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు.


జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు